

బాబోయ్
ప్లాస్టిక్ భూతం

అమలుకాని నిషేధం

నగరంలో విచ్చలవిడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం



వేడి వేడి ఆహార పదార్థాలు కూడా ప్యాకింగ్

ఆహారంతో కలిసి శరీరంలో చేరుతున్న ప్లాస్టిక్ రేణువులు

- అనేక అనారోగ్యాలకు దారితీసే ప్రమాదం
- ప్రతిరోజూ 150 మెట్రిక్ టన్నులు వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి
- 100 టన్నులు మాత్రమే రీసైక్లింగ్
- డ్రైనేజీలు, డంపింగ్ యార్డులకు చేరుతున్న మిగిలిన 50 టన్నులు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కేసులు నమోదుచేస్తున్నా ఆగని వినియోగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం మార్కెట్‌లో ఏ వస్తువు కొనుగోలు చేసినా దాంతోపాటు ప్లాస్టిక్‌కవర్ కూడా మన ఇంట్లో చేరిపోతోంది. చివరకు వేడిగా ఉండే ఆహార పదార్థాలు, టీ వంటి వాటిని కూడా ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసేస్తున్నారు. ఆ వేడికి ప్లాస్టిక్ రేణువులు కరిగి వాటిల్లో కలుస్తుంటాయి. ఆ ఆహారం/పానీయం తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. మరోవైపు ప్లాస్టిక్ కారణంగా నేల, నీరు కాలుష్యమయమై పర్యావరణం దెబ్బతింటోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల మానవాళికి పెనుముప్పు ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి వినియోగాన్ని నిషేధించినా, వినియోగం రానురాను పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ కవర్ల వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం...

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ సవాల్‌గా మారింది. ప్రధానంగా 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ మరింత ప్రమాదకరం. 50 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి ప్రత్యామ్నాయ వస్తువులు తయారుచేసుకునే వీలుంటుంది. కానీ 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ని రీసైక్లింగ్ చేయడం సాధ్యం కాదు. వీటిని భూమిలో పాతిపెట్టినాసరే మట్టిలో కలిసేందుకు 500 సంవత్సరాలకుపైగా పడుతుంది. ప్లాస్టిక్ దేనితో కలిసి అయినా ఎక్కువ కాలం నిల్వ వుంటే 'టాక్సినోజెన్స్' అనే రసాయనం విడుదలవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆ రసాయనం భూమిలో, నీటిలో, చివరకు మనిషి శరీరంలో చేరినా సరే సహజత్వాన్ని దెబ్బతీసేలా అసమతౌల్యం ఏర్పడుతుందంటున్నారు.



నగరంలో ప్రతిరోజూ సుమారు 1,100 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంటే అందులో 150 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. దీనిలో 50 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు, సంచులు 100 టన్నుల వరకూ ఉంటున్నాయి. వీటిని జీవీఎంసీ సహకారంతో కాపులుప్పాడలో ఏర్పాటుచేసిన యూనిట్‌లో పిల్లెట్‌లుగా మార్చి రీసైక్లింగ్ చేస్తున్నారు. మిగిలిన 50 టన్నులు మాత్రం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న సంచులు కావడంతో వాటిని రీసైక్లింగ్ చేయడం సాధ్యపడడం లేదు.

పర్యావరణ సైకిల్‌కు విఘాతం

ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరితే అక్కడ వాటిని ఇతర వ్యర్థాల నుంచి వేరు చేసి కాలుస్తున్నారు. దీనివల్ల విపరీతమైన పొగ వ్యాపించి పర్యావరణం కలుషితమవుతోంది. ప్లాస్టిక్‌ను తగలబెట్టినప్పుడు అత్యంత ప్రమాదకరమైన 'కార్సినోజెనిక్' అనే విషవాయువు వెలువడి గాలితో కలుస్తుంది. ఆ గాలిని పీల్చడం వల్ల జంతువులు, మనుషులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. శ్వాసకోశ వ్యాధులు, కేన్సర్ వంటి రోగాలు వస్తున్నాయి. అలాగే వేడి ఆహార పదార్థాలను కూడా ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాకింగ్ చేస్తున్నారు. వేడికి ప్లాస్టిక్ కరిగిపోయి 'టాక్సికోజీన్స్' అనే రసాయనం విడుదలై ఆహారంలో కలిసిపోతోంది. దానిని తినడం వల్ల కేన్సర్, గుండెజబ్బులు, ఆస్తమా, హార్మోన్ల అసమతుల్యం వంటివి ... మిగతా 6వ పేజీలో

గత ఏడాది జూన్ నుంచి ఈఏడాది మార్చి వరకు సీజ్ చేసిన వివరాలు

జీవీఎంసీ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు	10
దాడులు చేసిన దుకాణాలు	22,547
నిషేధించిన ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలు	8,013
సీజ్ చేసిన ప్లాస్టిక్	22,005 కిలోలు
విధించిన జరిమానా	రూ.97,02,150

కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్


- విశాఖ గౌరవం పెరిగేలా పనిచేస్తా
- 'ఆంధ్రజ్యోతి'తో కొత్త కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- నేడు బాధ్యతల స్వీకారం



హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం జిల్లాకు చాలా ప్రత్యేకతలు ఉన్నాయని, నగరం గౌరవం పెరిగేలా పనిచేస్తానని కొత్త కలెక్టర్‌గా నియమితులైన హరేంధిర ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారిగా పనిచేస్తున్న హరేంధిర ప్రసాద్‌ను విశాఖ కలెక్టర్‌గా వేసింది. ఆయన స్వస్థలం తమిళనాడు. కోయంబత్తూరులో ఇంజనీరింగ్ చదువుకున్నారు. తిరుచ్చిలో ఎంబీఏ చేశారు. ఆరేళ్లు ఇన్ఫోసిస్, విప్రో తదితర ఐటీ సంస్థల్లో పనిచేశారు. ఆ తరువాత సివిల్ సర్వీసులోకి వచ్చారు. 2015 సెప్టెంబరు నుంచి 2016 జూన్ వరకు ఐఏఎస్ శిక్షణ పొందారు. చిత్తూరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ తీసుకున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో అసిస్టెంట్ సెక్రటరీగా మూడు నెలలు చేశారు. కేఆర్ పురం (ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా) ఐటీడీఏ పీఓగా, సబ్ కలెక్టర్‌గా 31 నెలలు పనిచేశారు. అక్కడి నుంచి ఆర్థిక శాఖకు వెళ్లారు. డిప్యూటీ సెక్రటరీ కేడర్‌లో సీఈఓగా ఎఫ్ఎంఎస్‌లో కొంతకాలం పనిచేశారు. అదే సమయంలో కాపు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గాను సేవలు అందించారు. అక్కడి నుంచి నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్లారు. రెండేళ్లు అక్కడ సమర్థంగా పనిచేశారు. ఆ తరువాత విజయవాడకు బదిలీపై వెళ్లి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓగా సుమారు 17 నెలలు అంటే 2023 నవంబరు వరకు అక్కడే విధులు నిర్వహించారు. ఆ తరువాత రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా వెళ్లారు. ఇటీవల ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేశారు. ఇప్పుడు అక్కడి నుంచి విశాఖపట్నం కలెక్టర్‌గా వస్తున్నారు. బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు. విశాఖకు మంచిపేరు తెచ్చేలా విధులు నిర్వహిస్తానని వెల్లడించారు. ఒక టూరిస్ట్‌గా మాత్రమే ఇంతకు ముందు విశాఖపట్నం వచ్చానని, ఇప్పుడు కలెక్టర్‌గా రాబోతున్నానని చెప్పారు.

నెల్లూరు కలెక్టర్‌గా వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ ఆనంద్



ఓ.ఆనంద్

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వాణిజ్య పన్నుల శాఖలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఓ.ఆనంద్‌ను నెల్లూరు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేసిన ఆనంద్‌ను విశాఖపట్నం తీసుకువచ్చారు. ఇక్కడ కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో వందల కోట్ల రూపాయల పన్నుల సొమ్ము గోల్‌మాల్ జరిగింది. ఉద్యోగుల నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఈ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఈ కేసులో సుమారు పది మందిని బదిలీ చేశారు. పెద్ద ఎత్తున విచారణ జరిగింది. వాటన్నిటిని చక్కదిద్దడానికి ఆనంద్‌ను తీసుకువచ్చారు. 24/7 పనిచేస్తారనే పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు కలెక్టర్‌గా పదోన్నతిపై నెల్లూరు వెళుతున్నారు.

దూర విద్యలోనూ ఇష్టారాజ్యం

పరీక్షా కేంద్రాలు భారీగా పెంపు

గతంలో 50, ఇప్పుడు 100

- పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన కాలేజీల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- బయటి నుంచి వచ్చి చేరిన అధికారే చక్రం తిప్పినట్టు విమర్శలు
- అప్పటి ఉన్నతాధికారుల అండదండలు
- పరీక్షలు నిర్వహణలో అవకతవకలకు అవకాశం

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పరీక్షా కేంద్రాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నుంచి అటు కృష్ణా జిల్లా వరకూ గతంలో 50 పరీక్షా కేంద్రాలు ఉండేవి. అయితే, గత ఏడాది కాలంలో ఈ సంఖ్య వందకు చేరింది. ఈ వ్యవహారంలో ప్రైవేటు కాలేజీ నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగంలోకి వచ్చిన ఒక అధికారి చక్రం తిప్పినట్టు చెబుతున్నారు. ఇందుకోసం భారీమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.



విద్యార్థుల నుంచి పరీక్షల సమయంలో దండుకోవచ్చునన్న ఉద్దేశంతో అనేక కాలేజీలు దూర విద్య పరీక్షా కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకుంటుంటాయి. వీటిలో తమకు కావాల్సిన కాలేజీలకు సదరు అధికారి ఎగ్జామ్ సెంటర్లు మంజూరు చేయించారని చెబుతున్నారు. అందుకు అప్పట్లో వర్సిటీలోని కొందరు అధికారులు అడ్డుచెప్పినప్పటికీ నాటి వీసీ అండదండలతో ఆయన తాను అనుకున్నది చేసేశారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో నాటి ఉన్నతాధికారులకు కూడా ముడుపులు అందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల కేటాయింపులో అప్పటి డైరెక్టర్‌గా ఉన్న అధికారిని కూడా ప్రైవేటు కాలేజీ నుంచి వచ్చిన వ్యక్తి డమ్మీని చేశారన్న ప్రచారం ఉంది. ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు కోసం ఒక్కో కాలేజీ భారీగా ... మిగతా 6వ పేజీలో



సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ కార్యదర్శి కె. నారాయణ. చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఇతర నాయకులు ఉన్నారు.

-వార్త మెయిన్ ఎడిషన్‌లో...

పెద్ద దిక్కులేని వీఎంఆర్‌డీఏ!

రెండేళ్లుగా మెట్రోపాలిటన్ కమిషనర్ పోస్టు ఖాళీ

- కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగింత
- నిధులన్నీ జగనన్న కాలనీలకు వినియోగం
- ప్రస్తుతం ఖజానా ఖాళీ
- నగర అభివృద్ధికి ఈ ఐదేళ్లలో వీఎంఆర్‌డీఏ చేసిందేమీ లేదు
- ప్రభుత్వ మార్పు నేపథ్యంలో ఇప్పటికైనా పూర్తిస్థాయి అధికారిని నియమిస్తారా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు రెండేళ్ల నుంచి పూర్తిస్థాయి మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎంసీ) లేరు. సరిగ్గా రెండేళ్ల క్రితం ఎంసీగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డిని తిరుపతి కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆ వెంటనే విశాఖ కలెక్టర్‌గా ఉన్న మల్లికార్జునకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి వారం రోజుల క్రితం విశాఖ నుంచి బదిలీపై వెళ్లిపోయేంత వరకు ఆయనే ఎంసీగా వ్యవహరించారు. రెండేళ్లలో పట్టుమని పదిసార్లు కూడా ఆయన ఆ సంస్థ ప్రగతిని విశాఖ ప్రజలకు వివరించే ప్రయత్నం చేయలేదు. ఏదో పనులు జరుగుతున్నాయనే విధంగానే నడిపించారు.



విశాఖ జిల్లాలో జగనన్న కాలనీలకు లేఅవుట్లు వేయడం, వాటిల్లోమౌలిక వసతులు సమకూర్చే బాధ్యతను వైసీపీ ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. అందుకు ఆ సంస్థ వద్ద నిధులు ఉపయోగించాలని ఆదేశించింది. ఆ పనులన్నీ కలెక్టర్ సమన్వయం చేసుకుంటారనే ఆలోచనతో రెండు పోస్టులు ఒకరి చేతిలోనే పెట్టారు. ఈ విధంగా సుమారు రూ.500 కోట్లు వీఎంఆర్‌డీఏ నిధులు ఆ కాలనీలకు ఖర్చు చేశారు. సంస్థ ఖజానాను దాదాపు ఖాళీ చేశారు. అందుకు ప్రత్యామ్నాయంగా భూములు ఇస్తామని, వాటిని వేలం వేసి నిధులు సమకూర్చుకోవాలని ఓ మాట పడేశారు. వైసీపీ హయాంలో విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. విశాఖలో పరిపాలనా రాజధాని అంటూ రకరకాలుగా ప్రచారం చేసినా వీఎంఆర్‌డీఏ భూములను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న నిధులు జగనన్న కాలనీలకు పెట్టేశారు. ఈ ఐదేళ్లలో నగర, పర్యాటక ... మిగతా 6వ పేజీలో

చిట్‌ల పేరుతో రూ.2 కోట్లకు టోకరా

- నిర్వాహకురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

గోపాలపట్నం, జూలై 2: చిట్‌ల పేరుతో ఓ మహిళ సుమారు రెండు కోట్ల రూపాయలకు టోకరా వేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. 89వ వార్డు ఎల్లపువానిపాలేనికి చెందిన ఆళ్ల కనకమహాలక్ష్మి దాదాపు మూడు దశాబ్దాలుగా చిట్‌లు నిర్వహిస్తోంది. ఆమెపై పూర్తిగా నమ్మకం ఏర్పడడంతో ఎల్లపువానిపాలేనికి చెందిన వారితో పాటు వారి బంధువులు కూడా పెద్దసంఖ్యలో చిట్ వేశారు. అయితే గత ఏడాదికాలంగా ఆమె చిట్ వేసిన వారికి సకాలంలో నగదు చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వస్తుంది. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో బాధితులు మంగళవారం ఉదయం ఆమె ఇంటికి చేరుకుని తమకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఆమె నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితులంతా గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తమకు సుమారు రెండు కోట్ల రూపాయలను కనకమహాలక్ష్మి చెల్లించాల్సి ఉందని బాధితులు చెబుతున్నారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీసులకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలతో సీపీ ముఖాముఖి

- పెందుర్తిలోని వాంబేకాలనీ వాసులతో సమావేశం
- బాధ్యతలు స్వీకరించిన మరుసటిరోజే వినూత్న కార్యక్రమం
- సమస్యలు అడిగి తెలుసుకుని... పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన శంఖబ్రత బాగ్చీ

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన మరుసటిరోజే ఆయన ఈ కార్యక్రమం చేపట్టడంతో పోలీసులనే ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం రాత్రి పోలీస్ కమిషనర్ పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజులపాలెం వాంబే కాలనీ (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం)లో పర్యటించారు. అక్కడి నివాసితులను కలిసి భద్రతాపరంగా ఉన్న సమస్యలతోపాటు పోలీసుల సేవలకు సంబంధించిన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో రాత్రిపూట వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తమ కాలనీ చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోవడంతో భయంగా ఉంటోందని వాటిని తొలగించాలని కోరారు. తమ కాలనీ పరిసరాల్లో చీకటిపడితే ఆకతాయిలు పెట్రోలు దొంగతనం చేయడం, గంజాయి సేవించడం చేస్తున్నారని వాటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. దీనికి సీపీ స్పందిస్తూ జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వీలైనంత వేగంగా వీధి దీపాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ముళ్ల పొదలను తొలగించడంతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని పెందుర్తి సీఐను ఆదేశించారు. గంజాయి నియంత్రణకు ఇప్పటికే డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామన్నారు. ప్రత్యేక నిఘాతోపాటు షాడో టీమ్‌లను ఏర్పాటుచేసినందున ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని సీపీ వారికి భరోసానిచ్చారు. డీసీపీ-2 ఎం.సత్తిబాబు మాట్లాడుతూ సీపీగా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రతబాగ్చి తొలిసారి పాల్గొన్న కార్యక్రమం కావడంతో వాంబే కాలనీని తాను దత్తత తీసుకుని భద్రతాపరంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ వెంకటరత్నం పాల్గొన్నారు.



పెందుర్తిలోని వాంబేకాలనీ వాసులతో ముఖాముఖి మాట్లాడుతున్న సీపీ

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూలై 2: మొక్కలు విరివిగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమాన్ని అమ్మపేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమాన్ని సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీటిని పోశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సురేష్‌బాబు, ప్రొఫెసర్ శంకరరావు, అప్పన, వరప్రసాద్, వీరబాబు, నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసుకి రక్షణ సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్ తదితరులు

మాధవధార, జూలై 2; గ్రేటర్ 49వవార్డులో ఉన్న అగ్ని మాపక కేంద్రానికి (మర్రిపాలెం)కు మంగళవారం హిందుస్థాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ. 7లక్షల రక్షణ సామగ్రిని అందజేశారు. ఈ సంస్థ సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్, ఎ.వి.ఎస్. రావును ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఆర్.నిరంజన్ రెడ్డి సత్కరించారు. విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణగా పనిచేసే సిబ్బంది స్వీయ రక్షణకు ప్రాధాన్యమిస్తు కార్పొరేట్ సంస్థలు ముందుకి రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఓలు ప్రసాద్, గోపి, శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టర్నర్ చౌల్ట్రీ వద్ద షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది

జగదాంబ కూడలి, జూలై 2: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్‌షెల్టర్ నిర్మాణానికి దేవదాయశాఖ, జీవీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత ఇక్కడి బస్ షెల్టర్ కనుమరుగయ్యింది. బస్‌షెల్టర్ వైపు దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం నిర్మించారు. అలాగే, విశాఖ బజార్ కొత్తగా విస్తరించారు. ఈ నేపథ్యంలో 'టర్నర్ చౌల్ట్రీ వద్ద కనిపించని బస్‌షెల్టర్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం బస్‌షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష వ్యాపార కూడలి వద్ద బస్ షెల్టర్‌తో వ్యాపారులకు ఇబ్బందులు నెలకుంటున్నాయని తెలిపారు. ఇరువర్గాలు మధ్య ఒప్పందం మేరకు మెయిన్ రోడ్డు జీవీఎంసీ స్థలం వద్ద దేవదాయశాఖ రెండో ద్వారం మార్గంలో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి పనులు ప్రారంభించారు. దీనిని అడ్డుకోనేందుకు కొంతమంది వైసీపీ నాయకుల ప్రయత్నాలు ఫలించక పోవడం గమనార్హం.



రమాదేవి భానోజీరావు జీవీఎంసీ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



ఉండలుగా విజిటేబుల్ బిరియాని



ఆలూ కుర్మా

నాణ్యతలేని మధ్యాహ్న భోజనం

» రమాదేవి భానోజీరావు పాఠశాలలో చిన్నారులు అసంతృప్తి

డాబాగార్డెన్స్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం అందిస్తున్న భోజనాలపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా కూరల్లో కారం ఎక్కువగా, రుచికరంగా కూడా ఉండడంలేదని వారు వాపోతున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని రమాదేవి భానోజీరావు ప్రాథమిక పాఠశాలలోని ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులు చదుతున్నారు. ప్రాథమిక పాఠశాల కావడంతో పది పన్నెండేళ్ల వయస్సు వారే ఉంటారు. వీరికి అక్షయపాత్ర సంస్థ భోజనాల ను అందిస్తోంది. ఉదయం రాగిజావ, మధ్యాహ్నం భోజనంలో వివిధ రకాల మెనూను ప్రతీ రోజూ అందజేస్తోంది. ఇందులో సోమవారం రైస్ విత్ ఎగ్ కర్రి, చెక్కి, మంగళవారం పులిహోర, టమాటా చట్నీ, ఎగ్, బుధవారం వెజిటేబుల్ రైస్, అలుకుర్మా, ఎగ్, చెక్కి, గురువారం వెజిటేబుల్ రైస్ ఎగ్ శుక్రవారం రైస్, పప్పు, గ్రీన్ లేవ్స్, ఎగ్, చెక్కి, శనివారం పాలకూర, స్వీట్ పొంగల్‌ను ఆరు రోజుల పాటు సరఫరా చేస్తున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్న వెజిటేబుల్ బిరియాని, అలు కుర్మా రుచిగా ఉండటంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇందులో కూర కారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. వెజిటేబుల్ బిరియాని గట్టిగా ఉండటంతో తినలేకపోతున్నామని తెలియజేస్తున్నారు. ఇదే మెనూలో మార్పు చేసి రైస్‌తో పాటు ఆకుకూరలు ఎక్కువగా అందజేస్తే బాగుంటుందని వారంతా చెబుతున్నారు.

మెనూ మార్పు చేయాలి



భోజనం కొన్నింటిని మార్పుచేయాలి. భోజనంలో అందిస్తున్న ఆహార పదార్థాలు ఎక్కువగా తినేందుకు ఆసక్తి కలగడం లేదు. మెనూ మార్పు చేసి రుచికరంగా ఉండే వంటకాలను ఇస్తే బాగుంటుంది.

-ఎం. అవినాష్, విద్యార్థి, ఎనిమిదో తరగతి

కారం ఎక్కువగా ఉంటున్నాయి



వారంలో ఆరు రోజులు మెనూ కొన్నింటిని మార్పు చేయాలి. ప్రస్తుతం రోజు అందిస్తున్న వాటిలో కొన్ని రకాల కూరలు కారంగా ఉంటున్నాయి. దీంతో ఎక్కువగా తినలేకపోతున్నాం. అధికారులు స్పందించి మంచి మెనూ అందించాలి.

- మాలతి, ఎనిమిదో తరగతి

ఆకుకూరలు ఇవ్వాలి



ఆకుకూరలు ఎక్కువగా మెనూలో ఇస్తే బాగుంటుంది. విజిటేబుల్ బిర్యాని బదులుగా రైస్, ఆకుకూరలు ఇస్తే బాగుంటుంది. దీంతోపాటు మరైదేనా... వైరైటీ.. పెడితే బాగుంటుంది. అందరం ఆకుకూరలు తినేందుకు ఇష్టపడుతున్నాం. - హిమబింధు, విద్యార్థిని

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జూలై 2 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేళాలో నగరంలో గల ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చు. ఆసక్తి,అర్హత గల నిరుద్యోగులు తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శుక్రవారం ఉదయం 10గంటలకు అన్నీ ధ్రువపత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని సుబ్బిరెడ్డి సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

మహారాణిపేట, జూలై 2: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త హెచ్‌జీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పందిమెట్ట జంక్షన్‌లోని ఒక సమావేశమందిరంలో వ్యవసాయ ఆధునిక పద్ధతులు- నిపుణుల సలహాలు అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నిశబ్ద విప్లవం చోటు చేసుకుంటుందన్నారు. సంప్రదాయ సాగులోని సంక్లిష్టతలను స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల వైపు మరలాలని రైతులకు తెలిపారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా సాగు చేయాలన్నారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు ఈ సమావేశంలో పలు ప్రాంతాలకు చెందిన రైతు నాయకులు అశోక్, సుధాకర్‌రెడ్డి పలువురు రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీవో, కార్యదర్శులకు సన్మానం



సీవోను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను పంపిణీని విజయవంతంగా పూర్తి చేసిన జీవీఎంసీ సీవో రమణి, సచివాలయ కార్యదర్శులను, ఆర్పీలను 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువు, వికలాంగులు, వృద్ధాప్యపు పింఛన్లను పంపిణీ చేయడంలో సచివాలయాల కార్యదర్శులు, సీవో, ఆర్పీలు ఎంతో సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నరేష్, నాయకులు షేక్ బాబ్జీ, ఈశ్వరరావు, గొలగాని సౌజన్య, శెట్టి మోహన్‌దాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరపడవల సంఘ ఎన్నికల నిర్వహణపై గందరగోళం



సమావేశంలో పోలీసులు

మహారాణిపేట, జూలై 2: ఆంధ్రప్రదేశ్ మరపడవల సంఘం ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొంది. ప్రతీ రెండేళ్లకోసారి ఈ సంఘం ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ పదవీకాలం ముగిసింది. దీంతో మంగళవారం ఫిషింగ్ హార్బర్ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గత రెండేళ్లుగాఆ జరిగిన అకౌంట్లను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించారు. అనంతరం ఎన్నికల ఎలా నిర్వహించాలి అనే అంశంపై చర్చించారు. చేతులెత్తే విధానామా... సీక్రెట్ బ్యాలెట్ ద్వారా నిర్వహించాలా... అనే అంశంపై అభిప్రాయసేకరణ నిర్వహించారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరపాలని మెజారిటీ సభ్యులు తెలిపారు. బోటు యజమానుల వివరాలను మత్స్యశాఖ జేడీ సేకరించి త్వరలోనే ఎన్నికల తేదీ ప్రకటించనున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ,మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు వర్గానికి చెందిన సురపతి నరసింగరావు వర్గాల మధ్య ప్రస్తుతం పోటీ నెలకొంది. ఈ సమావేశ సమయంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కిడ్నీ ఇస్తామని రూ.10 లక్షలు దోచేశారు..

» సీతమ్మధారలోని ఓ ఆసుపత్రిలో వైద్యురాలు, కోఆర్డినేటర్ కేసు నమోదు

సీతంపేట, జూలై 2: కిడ్నీ మార్పుచేసి తన భార్య ప్రాణం కాపాడాలని వెళ్లిన వ్యక్తి వద్ద రూ. లక్షలు తీసుకుని సీతమ్మధారలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలోని ఓ వైద్యురాలు, ఆమె అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మోసగించారు. దీంతో బాధితుడు ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. పెందుర్తికి చెందిన సత్యనారాయణ గోపి, శారద లక్ష్మి దంపతులు. శారద లక్ష్మి కొద్దికాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారంలో మూడుసార్లు డయాలసిస్ చేయించాల్సిన పరి స్థితి. ఈ స్థితిలో వైద్యులు ఆమెకు కిడ్నీ మార్పిడి తప్పనిసరి అని సూచించారు. దీంతో గోపీ బంధువులు, కుటుంబ సభ్యులను ఆశ్రయించినా వారి కిడ్నీలు ఆమెకు సరికాలేదు. ఈ స్థితిలో గోపి సీతమ్మధారలోని ఓ ఆస్పత్రికి వచ్చి నెఫ్రాలజిస్టును సంప్రదించారు.. ఆమె తన అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించాలని సూచించారు. అనిల్ కలవడంతో కిడ్నీ కోసం దాతను సమకూర్చడంతోపాటు, ఆపరేషన్‌కు రూ. 27 లక్షలు అవుతుందని సూచించారు. ఈ మేరకు ఒప్పందం కుదరడంతో గోపి రూ.10 లక్షలు అనిల్‌కు ఇచ్చారు. అలాగే, 2022 లోనే గోపీ తన భార్యకు బాగోకపోవడంతో జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ప్రభుత్వం ద్వారా కిడ్నీ కేటాయింపు జరగడంతో నగరంలోనే వేరే ఆస్ప త్రిలో శారద లక్ష్మికి వైద్యం చేయించాడు. అనంతరం గతంలో కిడ్నీ కోసం అందజేసిన సొమ్మును సీతమ్మధార ఆస్పత్రిలోని వైద్యురాలిని, అసిస్టెంట్ అనిల్‌ను కలిసి కోరాడు. వారు తిరిగి రూ. 10 లక్షలు ఇవ్వకుండా నిరాకరించారు. మోసం చేశారని గ్రహించిన బాధితుడు ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. నిందితులిద్దరినీ విచారిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు.

దేవదాయ శాఖ ఏసీ శాంతిపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా రెండేళ్ల క్రితం వరకు విశాఖ జిల్లాలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లిన కాళింగరి శాంతిని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సస్పెండ్ చేసింది. ఆమె ఎక్కడ పనిచేసినా వివాదాస్పదమే. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పాసైన ఆమెకు నాలుగేళ్ల క్రితం విశాఖలో తొలి పోస్టింగ్ ఇచ్చారు. ఆమె వేధింపులు భరించలేక ఆ శాఖ ఉద్యోగులు అంతా జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వైసీపీ నేత విజయ సాయిరెడ్డి అండ చూసుకొని ఆమె మరింత పెట్రేగిపోయారు. తన పై అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ ముఖంపై ఇసుక కొట్టి అవమానించారు. అధిక ఆదాయం వచ్చే ఆలయాలకు తనను ఈఓగా, ఇన్‌ఛార్జిగా నియమించాలని ఒత్తిడి తెచ్చి ఏక కాలంలో నాలుగు పోస్టులు నిర్వహించారు. సంపత్ వినాయకుడి, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయాల ఈఓగా, జిల్లా దేవదాయ శాఖ అధికారిగా, పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా బాధ్యతల్లో కూడా ఆమె కొనసాగారు. కొన్నాళ్లు కనక మహాలక్ష్మి దేవస్థానం ఈఓగా కూడా చేశారు. పెందుర్తిలో వెంకటాద్రి ఆలయానికి వెళ్లి అక్కడ భక్తుల ముందే పూజారిని అవమానించారు. ఇక్కడ కూడా ఆమెకు ఉన్నతాధికారులు ఛార్జిమెమోలు ఇచ్చారు. కానీ వాటిని మళ్లీ విత్‌డ్రా చేయించుకున్నారు. కృష్ణా జిల్లాకు వెళ్లాక ఇంకా దూకుడుగా వ్యవహరించడంతో టీడీపీ ప్రభుత్వం రావడంతో బాధితులు అంతా ఆమె వ్యవహారాలు వెలుగులోకి తేవడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించి, ఆమెను సస్పెండ్ చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన పూజలు



అమ్మవారి పూజల్లో భక్తులు

పూర్ణామార్కెట్, జూలై 2: వన్‌టౌన్‌లోని బురుజుపేటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో అలంకరించి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన పూజలు జరిపారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అ లాగే, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు రెడ్డి. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న మహిళకు పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న కార్యదర్శులు

జ్ఞానాపురం, జూలై 2: గ్రేటర్ జోన్-5 ఆర్‌పీపేట-1 315 సచివాలయం పరిధిలోని గరిక శకుంతల అనే వృద్ధురాలు అనారోగ్యంతో గీతం ఆసుపత్రి చేరింది. దీంతో ఆమెకు పింఛన్‌ను రూ. 7వేలను సచివాలయ కార్యదర్శులు సీహెచ్ యశస్విని, అనిల్ కుమార్‌లు ఆసుపత్రికి వెళ్లి అందించారు. వృద్ధురాలు ఆనందం వ్యక్తంచేశారు.

అతిసారంపై అప్రమత్తం

అల్లిపురం, జూలై 2: డయేరియాపై అవగాహన పెంచుకుని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకులు కందుల నాగరాజు సూచించారు. భీమ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 34వ వార్డు కార్పొరేటర్ తోటపద్మావతి, వైద్యాధికారి ఈఎస్‌వీ నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర లయన్స్ గెలుపు

విశాఖపట్నం, జూలై 2: చివరి బంతి వరకు ఉత్కంఠ సాగిన మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ రెండు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 127 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్ (2), వంశీ కృష్ణ (17) నిరాశ పరిచారు. మిడిల్ ఆర్డర్‌లో హేమంత్ రెడ్డి (30; 4 ఫోర్లు, 1 సిక్సర్), వై.సందీప్ (21), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (21), చివర్లో కేవీ శశికాంత్ (12; 3 బంతుల్లో 2 సిక్సర్లు) ఆదుకోవడంతో గౌరవ ప్రదమైన స్కోరు చేరింది. ఉత్తరాంధ్ర బౌలర్లలో యర్రా పృథ్వీరాజ్ (3/15), పి.తపస్వి (2/13) రాణించారు. గోదావరి టైటాన్స్ నిర్దేశించిన సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో తడబడిన ఉత్తరాంధ్ర లయన్స్ విజయం కోసం చివరి బంతి వరకు పోరాడాల్సి వచ్చింది. కేవలం 14 పరుగులకే ఓపెనర్లు ఎస్.తరుణ్ (1), కెప్టెన్ గుల్ఫామ్ (4)తోపాటు, వన్‌డౌన్ తపస్వి (0) అవుటయ్యారు. ఈ దశలో బ్యాటింగ్‌కు దిగిన శ్రీరామ్ వెంకట రాహుల్ (31; 3 బౌండరీలు, 1 సిక్సర్), బి. సాత్విక్ (38; 1 ఫోర్, 4 సిక్సర్లు), సిర్ల శ్రీనిష్ (12), ధీరజ్ కువర్ (26 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్సర్లు) రాణించి ఆదుకోవడంతో 19.5 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 128 పరుగులు సాధించి విజయం అనూహ్య విజయం సొంతం చేసుకుంది. గోదావరి టైటాన్స్ బౌలర్లలో కేవీ.శశికాంత్ (3/29), వి.వర్మ (2/27) రాణించారు.

శారదా పీఠానికి ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకోవాలి

ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

» వివరాలు మెయిన్‌లో



శారదా పీఠానికి కేటాయించిన కొండను పరిశీలిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి

పింఛన్ల పంపిణీతో చంద్రబాబు సమర్థత వెల్లడి

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్



మాట్లాడుతున్న నజీర్

మహారాణిపేట, జూలై 2: రాష్ట్రం వ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో సాగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహిచిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమర్థత ఉన్న నాయకుడి పాలన ఎలా ఉంటుందో ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపారన్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వలంటీర్ల పేరుతో వృద్ధులకు పింఛన్లకు మూడునెలలపాటు ఇబ్బందులుపాలు చేశారన్నారు. కేవలం 1,26 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేసి, వాలంటీర్లు అవసరం లేదని నిరూపించారన్నారు. పెంచి మొత్తంతో పాటు ఒక్కొక్కరికి రూ. 7 వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ. 4వేల కోట్లు అందించారన్నారు. విశాఖ జిల్లాలోనే సుమారు 95 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయిందన్నారు.

బాబోయ్ ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

దరిచేరే ప్రమాదం ఉంటుంది. కాగా ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లోనూ, జనావాసాల మధ్య రోజుల తరబడి పేరుకుపోయి ఉంటున్నాయి. వర్షం పడినప్పుడు, డ్రైనేజీలో ప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు వాటిల్లో నీరు చేరుతుంది. ఇది దోమల వ్యాప్తికి అనుకూలంగా మారుతోంది. దోమల వ్యాప్తి కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల ద్వారా సముద్రంలోకి చేరడం వల్ల సముద్ర జలాలు కలుషితమైపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రజీవులు తినడం వల్ల అవి మృత్యువాతపడుతున్నాయి.

పెరుగుతున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం

కేంద్ర ప్రభుత్వం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. దీనికోసం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుచేసే బాధ్యతను స్థానిక సంస్థలకే అప్పగించింది. దీనిప్రకారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం పది ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటుచేసింది. ఆయా బృందాలు నిత్యం తమ పరిధిలోని దుకాణాలకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జరగకుండా చూడడం, విక్రయించే వారికి జరిమానా విధించి, సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను సీజ్ చేయడం చేస్తున్నాయి. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది మార్చి వరకూ 22,547 దుకాణాలపై దాడులు చేశాయి. అందులో నిషేధించిన ప్లాస్టిక్ విక్రయిస్తున్న 8,013 దుకాణాల నుంచి 22,005 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.97,02,150 జరిమానా విధించారు. అయినప్పటికీ విక్రయాలు మరింతగా పెరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో కేన్సర్ ముప్పు

డాక్టర్ టి.నారాయణరావు, జనరల్ సర్జన్, నారాయణ మెడ్‌సిటీ

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుంచి టాక్సికోజీన్స్ అనే రసాయనం ఉత్పత్తి అవుతుంది. అదిమనిషి శరీరంలోకి ప్రవేశిస్తే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తులపనితీరును ప్రభావితం చేస్తుంది.ఆస్తమా వంటి రోగాలు చుట్టుముడతా యి. ఎండోక్రైనాలజీ అసమతౌల్యం,హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బతీయడం వల్ల గుండె సంబంధిత సమస్యలు, డిప్రెషన్, మహిళల్లో సంతానలేమి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.పర్యావరణ సైకిల్‌ను కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దెబ్బతీస్తుంది.

తీవ్రమైన అనారోగ్య సమస్యలకు కారణం

- డాక్టర్ వి.మురళీకృష్ణ, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ

ప్లాస్టిక్ కవర్స్‌లో పోసిన టీని సేవించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు రావచ్చు. తాగేటప్పుడు మైక్రో ప్లాస్టిక్స్ శరీరంలోకి వెళ్లి అన్ని అవయవాలను డ్యామేజ్ చేయవచ్చు. దీర్ఘకాలంలో కొన్నిరకాల కేన్సర్లకు దారితీస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలకు దోహదం చేస్తాయి. కాబట్టి, ప్లాస్టిక్ కవర్స్ వినియోగాన్ని తగ్గించడం చాలా ఉత్తమం. ప్లాస్టిక్ కవర్స్ పర్యావరణానికి కూడా తీవ్ర విఘాతాన్ని కలిగిస్తాయి.

దూరవిద్యలోనూ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ముట్టజెప్పాయని, దీనిపై కొత్తగా వచ్చే వైస్ చాన్సలర్, ఇతర అధికారులు దృష్టిసారించి విచా రణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎగ్జామ్ సెంటర్‌తో మేలు

గతంతో పోలిస్తే ఏయూ దూరవిద్యా కేంద్రంలోని కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా కనీసం పది వేల నుంచి 15 వేల మంది చేరుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఎంతోకొంత గుంజుకోవచ్చునన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు పరీక్షా కేంద్రాల ఏర్పాటుకోసం యత్నిస్తున్నాయి. ఈ విధంగా నగర పరిధిలోని ఓ కాలేజీకి పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. విద్యార్థుల నుంచి ఆ కాలేజీ అధికారులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. విద్యార్థికి అవసరమైన సహకారాన్ని అందించాలంటే మరింత చెల్లించాల్సిందేనని చెబుతున్నారు. డబ్బులు ఇవ్వనివారిని ఇబ్బందులకు గురిచేస్తుంటారంటున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి తమకు కేటాయించే విద్యార్థుల ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునేందుకు కొన్ని కాలేజీల యాజమాన్యాలు యత్నిస్తున్నాయి.

స్టడీ సెంటర్లకు ఎగనామం

ప్రతి అవసరానికి ఏయూలోని దూర విద్యా కేంద్రానికి రావడం విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. దీనిని దృష్టి ఉంచుకుని దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గతంలో ఇటు శ్రీకాకుళం జిల్లా నుంచి అటు గుంటూరు జిల్లా వరకు పది స్టడీ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఈ స్టడీ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన సేవలు అందించేలా సిబ్బందిని నియమించారు. అడ్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి ఫీజులు వసూలు, పుస్తకాల పంపిణీ వంటి సేవలను అందించేవారు. అయితే, ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నామని చెప్పి ఈ స్టడీ సెంటర్లను అధికారులు పూర్తిగా ఎత్తేశారు.

పెద్దదిక్కు లేని వీఎంఆర్‌డీఏ!

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి చేసింది పెద్దగా ఏమీ లేదు. మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని చెప్పిన సిరిపురంలోని మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం ఇంకో మూడు నెలలకు గానీ పూర్తి అయ్యేలా లేదు. అలాగే ఎన్ఏడీ జంక్షన్‌లో ఫ్లైఓవర్ పూర్తయి నాలుగేళ్లు అయినా దానితో ముడిపడిన రైలు ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా ఊపందుకోలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించిన నేచురల్ హిస్టరీ పార్క్ మ్యూజియానికి 15 ఎకరాల స్థలం కేటాయించినా దాని డీపీఆర్‌కు ఇప్పటివరకూ మోక్షం లభించలేదు. సరైన అజమాయిషీ లేకపోవడంతో పీపీపీలు చేపట్టినవారు, షాపింగ్ కాంప్లెక్స్‌లు అద్దెకు తీసుకున్న వారు డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. ఆఖరి నిమిషంలో వాటిపై దృష్టి పెట్టడంతో చావు తప్పి కన్ను లొట్ట పోయినట్టుగా తయారైంది. కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ నడిపే ప్రైవేటు వ్యక్తి నుంచి రూ.2 కోట్లు రావలసి ఉందని ఆలస్యంగా గుర్తించి, కోర్టుకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకున్నారు. సీతమ్మధారలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ దుకాణదారుడు కోటి రూపాయల అద్దె కట్టలేక దానిని మూసేశాడు. అప్పుడు కళ్లు తెరిచి దానిని ఖాళీ చేయించారు. మరోవైపు వీఎంఆర్‌డీఏ భూములకు సరైన రక్షణ లేదు. ఉన్నతాధికారులకు తెలియకుండా దిగువ స్థాయి సిబ్బంది కోర్టులో అవతల పార్టీలకు అనుకూలంగా సాక్ష్యాలు చెబుతున్నా గుర్తించలేకపోతున్నారు. తెలుసుకునేసరికి ఆస్తులు పరాధీనం అవుతున్నాయి. ఇలా అనేక లోపాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌కే ఎంసీగా అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ఏర్పడిన సమస్యలు ఇవి. అలాకాకుండా ఇప్పటికైనా పూర్తిస్థాయి ఐఏఎస్ అధికారిని నియమిస్తే సంస్థ పట్టాల పైకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

విజయవంతంగా పింఛన్లు పంపిణీ

వలంటీర్లు లేకుండానే ప్రక్రియ పూర్తి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 2: రాష్ట్రంలో విజయవంతంగా పింఛన్ల పంపిణీని చేపట్టడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, దీంతో పింఛనుదారుల కళ్లల్లో ఎంతో ఆనందాన్ని చూశామన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేమంటూ గత వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడిందని, అయితే ఇప్పుడు తాము వలంటీర్లు లేకుండానే వంద శాతం పింఛన్లను ఒక్కరోజులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశామన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలవరం నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొండా జగన్, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గంధం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ బీ-బ్లాక్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కు



ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లోని పార్కులో పశువులు సంచరిస్తున్న దృశ్యం

ఆటోనగర్‌లో పార్కులు అధ్వానం

నిరుపయోగంగా ఉండడంతో ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం

ఇష్టానుసారంగా పశువుల సంచారం

అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు

ఆటోనగర్, జూలై 2: ఆటోనగర్‌లో పలు పార్కులు అధ్వానంగా తయారయ్యాయి. సందర్శకులు కూర్చునే బెంచీలు, చిన్నారుల ఆట వస్తువులు పాడైపోయి మచ్చుకైనా కానరాని పరిస్థితులు నెలకొన్నాయి. పార్కుల పర్యవేక్షణ కొరవడడంతో అవి నిరుపయోగంగా మారి ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్‌లోని బీ-బ్లాక్, ఈడబ్ల్యూఎస్ పార్కులకు ప్రహరీ గోడలు కూడా లేకపోవడంతో పశువులు విచ్చలవిడిగా లోపల సంచరిస్తున్నాయి. పలువురు చెత్తాచెదారాన్ని, డెబ్రిస్‌ను ఆయా పార్కుల్లో ఇష్టానుసారంగా పడేస్తున్నారు. వీటి పర్యవేక్షణ కొరవడడం వల్లే ఆయా పార్కులు దయనీయ స్థితికి చేరాయని స్థానికులు వాపోతున్నారు. పచ్చదనంతో, చిన్నారుల ఆట వస్తువులతో పార్కులను సుందరంగా తీర్చిదిద్దితే ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వర్గాల వారు ఆహ్లాదకరంగా గడిపేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం పార్కులు ఖాళీగా ఉండడంతో సాయంత్రమయ్యేసరికి ఎక్కడెక్కడ నుంచో ఆకతాయిలు ఇక్కడకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. అలాగే కుక్కలు, పందులు, ఆవులు, గేదెలు పార్కుల్లో సంచరించడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో పార్కుల్లోకి వెళితేనే తీవ్ర దుర్గంధం వస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దయనీయంగా మారిన ఈ పార్కులను జీవీఎంసీ అధికారులు అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి కోసం ఖాళీ బకెట్లతో మహిళల నిరసన



యాదవ జగ్గరాజుపేటలో నిరసన తెలుపుతున్న మహిళలు

కూర్మన్నపాలెం, జూలై 2: జీవీఎంసీ 88వ వార్డు పరిధి కాపు జగ్గరాజుపేటలో మంగళవారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం మేహాద్రి గెడ్డ నుంచి తాగునీరు వచ్చేలా పైపులైన్లు వేసినా, పదుల సంఖ్యలో కొళాయిలు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. అయితే అవి కూడా ప్రస్తుతం సక్రమంగా పని చేయడం లేదని వాపోయారు. ఎప్పుడు కొళాయిల నుంచి నీరు వస్తుందో తెలియని దుస్థితి నెలకొందని, నీరు వచ్చినా రెండు బిందెలు కూడా నిండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో తమకు తాగునీరు రాకపోవడంతో నానాపాట్లు పడుతున్నామన్నారు. తాగునీటి కోసం బోరింగులపై ఆధారపడుతున్నామని, అయితే వాటి నుంచి కూడా దుర్వాసన వస్తుండడంతో తాగడానికి ఉపయుక్తంగా ఉండడం లేదన్నారు. దీంతో తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. తమ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇంటింటికీ కొళాయిలు వేసి తాగునీరు సక్రమంగా వచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామపెద్ద జి.గంగా మహేశ్ కోరారు.

శంకర్ ఫౌండేషన్‌లో 3 నెలల్లో 8,839 నేత్ర శస్త్ర చికిత్సలు

కంటి ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు

వేపగుంట, జూలై 2: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన నేత్ర వైద్యం అందజేస్తున్న నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గడిచిన ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 8,839 నేత్ర శస్త్ర చికిత్సలు, 50,555 మంది అవుట్ పేషంట్లకు సేవలు అందించినట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక వైద్య సేవల్లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అనేక మారుమూల గ్రామాల్లో 130 ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించి 3,265 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయడం జరిగిందన్నారు. 1997 నుంచి ఇప్పటివరకు 4,48,869 కంటి శస్త్ర చికిత్సలు, 26,14,402 మంది అవుట్ పేషెంట్లకు నేత్ర పరీక్షలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ఆస్పత్రిలో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ల ద్వారా రెటీనా, రెటినా ఇంజెక్షన్లు, గ్లకోమా, కార్నియా, పిడియాట్రిక్ కంటి వైద్యం, అర్బిట్ వంటి వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు, సిబ్బంది కృషితో భవిష్యత్తులోనూ ప్రజలకు ఉత్తమ నేత్ర వైద్యాన్ని అందిస్తామని బంగార్రాజు పేర్కొన్నారు.

శభాష్ సచివాలయ సెక్రటరీ

అనారోగ్యంతో మంచం పట్టిన వృద్ధురాలికి పింఛన్ ఇచ్చేందుకు 50 కిలోమీటర్లు ప్రయాణించిన చిరంజీవి



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సెక్రటరీ చిరంజీవి

ఆటోనగర్, జూలై 2: జీవీఎంసీ 70వ వార్డు పరిధి ఎర్రగెడ్డ కాలనీలో నివాసం ఉంటున్న 80 ఏళ్ల చింతలపాటి భవానీ ప్రమాదానికి గురై మంచానికే పరిమితం కావడంతో పద్మనాభం మండలం గంధవరంలో తమ కుమార్తె వద్ద ఉంటుంది. అయితే వృద్ధాప్య పింఛన్ ఇచ్చేందుకు సోమవారం ఆమె ఇంటికి సచివాలయ సెక్రటరీ చిరంజీవి వెళ్లారు. భవానీ అనారోగ్యం కారణంగా గంధవరంలో కుమార్తె వద్ద ఉంటున్నట్టు స్థానికుల ద్వారా ఆయన తెలుసుకున్నారు. ఆమె స్థితికి చలించిన చిరంజీవి కూటమి నాయకులు, ఉన్నతాధికారుల సూచన మేరకు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై సుమారు యాభై కిలోమీటర్లు ప్రయాణించి గంధవరం చేరుకుని భవానీకి ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద రూ.7,000 అందజేశారు. తన మందుల ఖర్చులకు ఈ డబ్బులు ఎంతగానో పనిచేస్తాయని ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపింది. ఎంతో ప్రయాసతో భవానీకి పింఛన్ అందజేసిన చిరంజీవిని పలువురు కూటమి నాయకులు ప్రశంసించారు.

'ఉక్కు'ను సెయిల్‌లో విలీనం చేస్తే మంచి ఫలితాలు

ఆ దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి



విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 2: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు కృషి చేయాలని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం ఆయనను నగరంలో కలిసి పలు విషయాలపై చర్చించారు. ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయడం వల్ల ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అదే విధంగా ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం విరమించుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ ఉన్నారు.

కేన్సర్ బాధితుడికి దాతలు సాయం

అగనంపూడి, జూలై 2: కేన్సర్ వ్యాధితో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తాడి శ్రీను అనే వ్యక్తిని ఆర్థికంగా ఆదుకునేందుకు స్థానిక దాతలు ముందుకు వచ్చారు. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు ఇచ్చిన పిలుపు మేరకు దాతలు రూ.15 వేలు సమకూర్చగా, ఈ మొత్తాన్ని పినమడకలో నివాసం ఉంటున్న శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ కేన్సర్‌తో బాధపడుతున్న శ్రీను కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో దాతలు గుదే సుశీలగజేంద్రరరావు, హనుమంతరావు, విందుల వరహాలు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, నరేశ్, సూరిబాబు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఏఈకి వినతి

అగనంపూడి, జూలై 2: జీవీఎంసీ 85వ వార్డు పరిధి సాయినగర్ కాలనీ, అండమాన్ కొండయ్యవలసలోని నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు స్థానికులు మంగళవారం ఈపీడీసీఎల్ ఏఈ లక్ష్మణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. లోవోల్టేజీ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఏఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏఈని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కత్తి తిలక్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రమణరాజు, ప్రసాద్, తాతబాబు, సుబ్రహ్మణ్యం, నాగరాజు, సత్తిబాబు, అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

గాజువాక, జూలై 2: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణ దానం చేసిన వారవుతామని గాజువాక స్టీల్ సిటీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాసంగి తిరుపతిరావు అన్నారు. గాజువాకలోని డిఫెన్స్ అకాడమీలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇంకా కొంతమందిలో రక్తదానంపై అపోహలు ఉన్నాయని, ఆరోగ్యంగా ఉన్న యువత రక్తదానం చేయవచ్చన్నారు. ఈ శిబిరంలో 95 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కేవై .దాస్, తెంటు సత్యనారాయణ, కొల్లి సత్యంబాబు, రిషికేష్, బండి శ్రీనివాస్, కృష్ణకుమార్, ఎం.మురళీ, గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బంగారమ్మ వార్షికోత్సవాలు

ఆర్పీపేట (కంచరపాలెం), జూలై 2: జీవీఎంసీ 57వ వార్డు ఆశవానిపాలెంలో కొలువుదీరిన బంగారమ్మ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారి పండగ ముగింపు సందర్భంగా మంగళవారం గ్రామ కమిటీ, ఆలయ నిర్వహణ పెద్దలు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ నిర్వహణకర్తలు అంబటి సంతోశ్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కింజరాపు సూర్యనారాయణ, సత్యవతి, సుజాత, వెంకటరావు, టాస్ హరినారాయణ, రాజాన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, జూలై 2: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్ర నామ పారాయణాలను పఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ రామారావు పాల్గొన్నారు.



కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారు

కల్పవృక్ష వాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం, జూలై 2: జీవీఎంసీ 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ప్రాతఃకాల ఆరాధన, మూలమంత్ర హోమాలు, సుదర్శన హోమాన్ని జరిపారు. సాయంత్రం వైభవ్ వేంకటేశ్వర స్వామిని కల్పవృక్ష వాహనంపై ఉభయదేవేరులతో అధిష్ఠింపజేసి కోలాటాలు, మహిళల అన్నమాచార్యుల గీతాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులతో పాటు మోహిత్, చిన్న సురేశ్, మల్లికార్జున్, పద్మజ, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరాలయంలో పూజలు

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అలాగే భరత్‌నగర్ సమీపంలోని లక్ష్మీనరసింహనగర్‌లో గోపీజనవల్లభ స్వామి ఆలయంలో స్వామివారికి ఆవుపాలతో అభిషేకం, సామూహిక భగవద్గీత పారాయణం పఠించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఎన్ఏడీ కూడలి శాంతినగర్‌లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో సుమారు ఐదు వందల మంది భక్తులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ సీఈకి సత్కారం



సంపతిరావు నారాయణమూర్తిని సత్కరిస్తున్న అధికారులు

ఆటోనగర్, జూలై 2: ఆటోనగర్‌లో విద్యుత్ కేంద్రంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సంపతిరావు నారాయణమూర్తిని కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సి.ప్రభాకర్ మాట్లాడుతూ వివిధ హోదాలలో పనిచేసి సహచర ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని గుర్తించి వెలికితీసిన ఘనత నారాయణమూర్తికి దక్కుతుందన్నారు. ఆయన పర్యవేక్షణలో ఎన్నో విద్యుత్ ఉప కేంద్రాలు, విద్యుత్ మార్గాల విస్తరణ, తదితర పనులు జరిగాయని ప్రభాకర్ కొనియాడారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల ఎస్ఈలు రమణారావు, విజయకుమార్, రామారావు, జాన్, డీఈలు, ఏడీఈ మీన కేతనరావు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూలై 2: పద్మనాభపురంలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు, బంటా కాలనీలో ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కారణంగా బంటా కాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 48, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 34, క్యారెట్ 36, దొండకాయలు 18, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 145, బరబాటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



కొండవాలు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

91వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

గోపాలపట్నం, జూలై 2: జీవీఎంసీ 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు జీవీఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కొండవాలు ప్రాంతంలోని పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కొండవాలు ప్రాంతంలో రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం చేపట్టడంతో పాటు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు గణబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రేటర్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తికి ముడిసరకు కొరత

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం, జూలై 2: స్టీల్‌ప్లాంటులో ఉక్కు ఉత్పత్తికి ముడిసరకు కొరత వేధిస్తుందని పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,237వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సాధారణ ఉత్పత్తి చేసేందుకు ముడిసరకు కొరత ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా సకాలంలో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి ఉక్కు కర్మాగారం చేరుకోవడం శోచనీయమన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కనకరాజు, గంగాధర్, శ్రీనివాస్, రమణ, సదాశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం పిలుపుతో మొక్కలు నాటుతున్నాం

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



మొక్క నాటి నీరు పోస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూలై 2: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గాజువాకలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. గాజువాకలోని 20 వార్డుల్లో ఐదు రోజుల పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. అందరూ మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు గూటూరు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

'పల్లా'కు ఎస్టీబీఎల్ చైర్మన్ బాలాజీ అభినందనలు



పల్లా శ్రీనివాసరావుతో బాలాజీ వీరభద్రరావు, తదితరులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 2: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పల్లా శ్రీనివాసరావును కలిసిన వారిట ఎస్టీబీఎల్ జీఎం జీవీ కృష్ణయ్య, జీజీ మహేశ్, వంకినేని జీవన్‌బాబు, నిమ్మగడ్డ నరసింహరావు, తదితరులు ఉన్నారు.

మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

అక్కిరెడ్డిపాలెం, జూలై 2: రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించడం పట్ల 68, 69 వార్డులకు చెందిన కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ 68వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు శీరం రాజేశ్, డి.అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మిందిలో టీడీపీ నాయకులు ఈటి శ్రీను, ఎ.విజయలక్ష్మి, తాతారావు తదితరులు చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూలై 2: మొక్కలు విరివిగా నాటడం ద్వారా పర్యవరణాన్ని పరిరక్షించవచ్చునని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమాన్ని అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమాన్ని సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీటిని పోశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సురేష్‌బాబు, ప్రొఫెసర్ శంకరరావు, అప్పన, వరప్రసాద్, వీరబాబు, నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసుకి రక్షణ సామగ్రి అందజేత


సామగ్రి అందిస్తున్న సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్ తదితరులు

మాధవధార, జూలై 2; గ్రేటర్ 49వవార్డులో ఉన్న అగ్ని మాపక కేంద్రానికి (మర్రిపాలెం)కు మంగళవారం హిందుస్థాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ. 7లక్షల రక్షణ సామగ్రిని అందజేశారు. ఈ సంస్థ సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్, ఎ.వి.ఎస్. రావును ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఆర్.నిరంజన్ రెడ్డి సత్కరించారు. విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణగా పనిచేసే సిబ్బంది స్వీయ రక్షణకు ప్రాధామ్యమిస్తు కార్పొరేట్ సంస్థలు ముందుకి రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓలు ప్రసాద్, గోపి, శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్‌షెల్డర్ నిర్మాణానికి చర్యలు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


టర్నర్ చౌల్ట్రీ వద్ద షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది

జగదాంబ కూడలి, జూలై 2: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్‌షెల్డర్ నిర్మాణానికి దేవదాయశాఖ, జీవీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత ఇక్కడి బస్ షెల్టర్ కనుమరుగయ్యింది. బస్‌షెల్టర్ వైపు దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం నిర్మించారు. అలాగే, విశాఖ బజార్ కొత్తగా విస్తరించారు. ఈ నేపథ్యంలో 'టర్నర్ చౌల్ట్రీ వద్ద కనిపించని బస్‌షెల్డర్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం బస్‌షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష వ్యాపార కూడలి వద్ద బస్ షెల్డర్‌తో వ్యాపారులకు ఇబ్బందులు నెలకుంటున్నాయని తెలిపారు. ఇరువర్గాలు మధ్య ఒప్పందం మేరకు మెయిన్ రోడ్డు జీవీఎంసీ స్థలం వద్ద దేవదాయశాఖ రెండో ద్వారం మార్గంలో బస్ షెల్డర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి పనులు ప్రారంభించారు. దీనిని అడ్డుకోనేందుకు కొంతమంది వైసీపీ నాయకుల ప్రయత్నాలు ఫలించక పో వడం గమనార్హం.


రమాదేవి భానోజీరావు జీవీఎంసీ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు


ఉండలుగా విజిటేబుల్ బిరియాని


ఆలూ కుర్మా

నాణ్యతలేని మధ్యాహ్న భోజనం

» రమాదేవి భానోజీరావు పాఠశాలలో చిన్నారులు అసంతృప్తి

డాబాగార్డెన్స్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం అందిస్తున్న భోజనాలపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా కూరల్లో కారం ఎక్కువగా, రుచికరంగా కూడా ఉండడంలేదని వారు వాపోతున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని రమాదేవి భానోజీరావు ప్రాథమిక పాఠశాలలోని ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులు చదుతున్నారు. ప్రాథమిక పాఠశాల కావడంతో పది పన్నెండేళ్ల వయస్సు వారే ఉంటారు. వీరికి అక్షయపాత్ర సంస్థ భోజనాల ను అందిస్తోంది. ఉదయం రాగిజావ, మధ్యాహ్నం భోజనంలో వివిధ రకాల మెనూను ప్రతీ రోజూ అందజేస్తోంది. ఇందులో సోమవారం రైస్ విత్ ఎగ్ కర్రి, చెక్కి, మంగళవారం పులిహోర, టమాటా చట్నీ, ఎగ్, బుధవారం వెజిటేబుల్ రైస్, ఆలుకుర్మా, ఎగ్, చెక్కి, గురువారం వెజిటేబుల్ రైస్ ఎగ్, శుక్రవారం రైస్, పప్పు, గ్రీన్ లేవ్స్, ఎగ్, చెక్కి, శనివారం పాలకూర, స్వీట్ పొంగల్‌ను ఆరు రోజుల పాటు సరఫరా చేస్తున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్న వెజిటేబుల్ బిరియాని, అలు కుర్మా రచిగా ఉండటంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇందులో కూర కారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. వెజిటేబుల్ బిరియాని గట్టిగా ఉండటంతో తినలేకపోతున్నామని తెలియజేస్తున్నారు. ఇదే మెనూలో మార్పు చేసి రైస్‌తో పాటు ఆకుకూరలు ఎక్కువగా అందజేస్తే బాగుంటుందని వారంతా చెబుతున్నారు.

మెనూ మార్పు చేయాలి



భోజనం కొన్నింటిని మార్పుచేయాలి. భోజనంలో అం దిస్తున్న ఆహార పదార్థాలు ఎక్కువగా తినేందుకు ఆసక్తి కలగడం లేదు. మెనూ మార్పు చేసి రుచికరంగా ఉండే వంటకాలను ఇస్తే బాగుంటుంది.

-ఎం. అవినాష్, విద్యార్థి, ఎనిమిదో తరగతి

కారం ఎక్కువగా ఉంటున్నాయి



వారంలో ఆరు రోజులు మెనూ కొన్నింటిని మార్పు చేయాలి. ప్రస్తుతం రోజు అందిస్తున్న వాటిలో కొన్ని రకాల కూరలు కారంగా ఉంటున్నాయి. దీంతో ఎక్కువగా తినలేకపోతున్నాం. అధికారులు స్పందించి మంచి మెనూ అందించాలి.

- మాలతి, ఎనిమిదో తరగతి

ఆకుకూరలు ఇవ్వాలి



ఆకుకూరలు ఎక్కువగా మెనూలో ఇస్తే బాగుంటుంది. విజిటేబుల్ బిర్యాని బదులుగా రైస్, ఆకుకూరలు ఇస్తే బాగుంటుంది. దీంతోపాటు మరైదేనా... వైరైటీ.. పెడితే బాగుంటుంది. అందరం ఆకుకూరలు తినేందుకు ఇష్టపడుతున్నాం. - **హిమబింధు, విద్యార్థిని**

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జూలై 2 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేళాలో నగరంలో గల ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు." పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చు. ఆసక్తి,అర్హత గల నిరుద్యోగులు తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శుక్రవారం ఉదయం 10గంటలకు అన్నీ ధ్రువపత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని సుబ్బిరెడ్డి సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

మహారాణిపేట, జూలై 2: ఆదునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త హెచ్‌జీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పందిమెట్ట జంక్షన్‌లోని ఒక సమావేశమందిరంలో వ్యవసాయ ఆదునిక పద్ధతులు- నిపుణుల సలహాలు అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నిశబ్ద విప్లవం చోటు చేసుకుంటుందన్నారు. సంప్రదాయ సాగులోని సంక్లిష్టతలను స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల వైపు మరలాలని రైతులకు తెలిపారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా సాగు చేయాలన్నారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు ఈ సమావేశంలో పలు ప్రాంతాలకు చెందిన రైతు నాయకులు అశోక్, సుధాకర్‌రెడ్డి పలువురు రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీవో, కార్యదర్శులకు సన్మానం


సీవోను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను పంపిణీని విజయవంతంగా పూర్తి చేసిన జీవీఎంసీ సీవో రమణి, సచివాలయ కార్యదర్శులను, ఆర్పీలను 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువు, వికలాంగులు, వృద్ధాప్యపు పింఛన్లను పంపిణీ చేయడంలో సచివాలయాల కార్యదర్శులు, సీవో, ఆర్పీలు ఎంతో సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నరేష్, నాయకులు షేక్ బాబ్జీ, ఈశ్వరరావు, గొలగాని సౌజన్య, శెట్టి మోహన్‌దాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరపడవల సంఘ ఎన్నికల నిర్వహణపై గందరగోళం


సమావేశంలో పోలీసులు

మహారాణిపేట, జూలై 2: ఆంధ్రప్రదేశ్ మరపడవల సంఘం ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొంది. ప్రతీ రెండేళ్లకోసారి ఈ సంఘం ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ పదవీకాలం ముగిసింది. దీంతో మంగళవారం ఫిషింగ్ హార్బర్ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గత రెండేళ్లుగగాఆ జరిగిన అకౌంట్లను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించారు. అనంతరం ఎన్నికల ఎలా నిర్వహించాలి అనే అం శంపై చర్చించారు. చేతులెత్తే విధానామా... సీక్రెట్ బ్యాలెట్ ద్వారా నిర్వహించాలా.. అనే అంశంపై అభిప్రాయసేకరణ నిర్వహించారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరపాలని మెజారిటీ సభ్యులు తెలిపారు. బోటు యజమానుల వివరాలను మత్స్యశాఖ జేడీ సేకరించి త్వరలోనే ఎన్నికల తేదీ ప్రకటించనున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ,మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు వర్గానికి చెందిన సురపతి నరసింగరావు వర్గాల మధ్య ప్రస్తుతం పోటీ నెలకొంది. ఈ సమావేశ సమయంలో కొంత ఉద్రిక్త పరిసితి నెలకొనడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కిడ్నీ ఇస్తామని రూ.10 లక్షలు దోచేశారు..

» సీతమ్మధారలోని ఓ ఆసుప్రతిలో వైద్యురాలు, కోఆర్డినేటర్ కేసు నమోదు

సీతంపేట, జూలై 2: కిడ్నీ మార్పుచేసి తన భార్య ప్రాణం కాపాడాలని వెళ్లిన వ్యక్తి వద్ద రూ. లక్షలు తీసుకుని సీతమ్మధారలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలోని ఓ వైద్యురాలు, ఆమె అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మోసగించారు. దీంతో బాధితుడు ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. పెందుర్తికి చెందిన సత్యనారాయణ గోపి, శారద లక్ష్మి దంపతులు. శారద లక్ష్మి కొద్దికాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారంలో మూడుసార్లు డయాలసిస్ చేయించాల్సిన పరి స్థితి. ఈ స్థితిలో వైద్యులు ఆమెకు కిడ్నీ మార్చిడి తప్పనిసరి అని సూచించారు. దీంతో గోపీ బంధువులు, కుటుంబ సభ్యులను ఆశ్రయించినా వారి కిడ్నీలు ఆమెకు సరికాలేదు. ఈ స్థితిలో గోపి సీతమ్మధారలోని ఓ ఆస్పత్రికి వచ్చి నెఫ్రాలజిస్టును సంప్రదించారు.. ఆమె తన అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించాలని సూచించారు. అనిల్ కలవడంతో కిడ్నీ కోసం దాతను సమకూర్చడంతోపాటు, ఆపరేషన్‌కు రూ. 27 లక్షలు అవుతుందని సూచించారు. ఈ మేరకు ఒప్పందం కుదరడంతో గోపి రూ.10 లక్షలు అనిల్‌కు ఇచ్చారు. అలాగే, 2022 లోనే గోపీ తన భార్యకు బాగోకపోవడంతో జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ప్రభుత్వం ద్వారా కిడ్నీ కేటాయింపు జరగడంతో నగరంలోనే వేరే ఆస్ప త్రిలో శారద లక్ష్మికి వైద్యం చేయించాడు. అనంతరం గతంలో కిడ్నీ కోసం అందజేసిన సొ మ్మును సీతమ్మధార ఆస్పత్రిలోని వైద్యురాలిని, అసిస్టెంట్ అనిల్‌ను కలిసి కోరాడు. వారు తిరిగి రూ. 10 లక్షలు ఇవ్వకుండా నిరాకరించారు. మోసం చేశారని గ్రహించిన బాధితుడు ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. నిందితులిద్దరినీ విచారిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు.

దేవదాయ శాఖ ఏసీ శాంతిపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా రెండేళ్ల క్రితం వరకు విశాఖ జిల్లాలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లిన కాళింగరి శాంతిని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సస్పెండ్ చేసింది. ఆమె ఎక్కడ పనిచేసినా వివాదాస్పదమే. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పాసైన ఆమెకు నాలుగేళ్ల క్రితం విశాఖలో తొలి పోస్టింగ్ ఇచ్చారు. ఆమె వేధింపులు భరించలేక ఆ శాఖ ఉద్యోగులు అంతా జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వైసీపీ నేత విజయ సాయిరెడ్డి అండ చూసుకొని ఆమె మరింత పెట్రేగిపోయారు. తన పై అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ ముఖంపై ఇసుక కొట్టి అవమానించారు. అధిక ఆదాయం వచ్చే ఆలయాలకు తనను ఈఓగా, ఇన్‌ఛార్జిగా నియమించాలని ఒత్తిడి తెచ్చి ఏక కాలంలో నాలుగు పోస్టులు నిర్వహించారు. సంపత్ వినాయకుడి, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయాల ఈఓగా, జిల్లా దేవదాయ శాఖ అధికారిగా, పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా బాధ్యతల్లో కూడా ఆమె కొనసాగారు. కొన్నాళ్లు కనక మహాలక్ష్మి దేవస్థానం ఈఓగా కూడా చేశారు. పెందుర్తిలో వెంకటాద్రి ఆలయానికి వెళ్లి అక్కడ భక్తుల ముందే పూజారిని అవమానించారు. ఇక్కడ కూడా ఆమెకు ఉన్నతాధికారులు ఛార్జిమెమోలు ఇచ్చారు. కానీ వాటిని మళ్లీ విత్‌డ్రా చేయించుకున్నారు. కృష్ణా జిల్లాకు వెళ్లాక ఇంకా దూకుడుగా వ్యవహరించడంతో టీడీపీ ప్రభుత్వం రావడంతో బాధితులు అంతా ఆమె వ్యవహారాలు వెలుగులోకి తేవడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించి, ఆమెను సస్పెండ్ చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన పూజలు


అమ్మవారి పూజల్లో భక్తులు

పూర్ణామార్కెట్, జూలై 2: వన్‌టౌన్‌లోని బురుజుపేటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో అలంకరనించి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన పూజలు జరిపారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అ లాగే, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు రెడ్డి. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న మహిళకు పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న కార్యదర్శులు

జ్ఞానాపురం, జూలై 2: గ్రేటర్ జోన్-5 ఆర్‌పీపేట-1 315 సచివాలయం పరిధిలోని గరిక శకుంతల అనే వృద్ధురాలు అనారోగ్యంతో గీతం ఆసుపత్రి చేరింది. దీంతో ఆమెకు పింఛన్‌ను రూ. 7వేలను సచివాలయ కార్యదర్శులు సీహెచ్ యశస్విని, అనిల్ కుమార్‌లు ఆసుపత్రికి వెళ్లి అందించారు. వృద్ధురాలు ఆనందం వ్యక్తంచేశారు.

అతిసారంపై అప్రమత్తం

అల్లిపురం, జూలై 2: డయేరియాపై అవగాహన పెంచుకుని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకులు కందుల నాగరాజు సూచించారు. భీమ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 34వ వార్డు కార్పొరేటర్ తోటపద్మావతి, వైద్యాధికారి ఈఎస్‌వీ నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర లయన్స్ గెలుపు

విశాఖపట్నం, జూలై 2: చివరి బంతి వరకు ఉత్కంఠ సాగిన మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ రెండు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 127 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్ (2), వంశీ కృష్ణ (17) నిరాశ పరిచారు. మిడిల్ ఆర్డర్‌లో హేమంత్ రెడ్డి (30; 4 ఫోర్లు, 1 సిక్సర్), వై.సందీప్ (21), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (21), చివర్లో కేవీ శశికాంత్ (12; 3 బంతుల్లో 2 సిక్సర్లు) ఆదుకోవడంతో గౌరవ ప్రదమైన స్కోరు చేరింది. ఉత్తరాంధ్ర బౌలర్లలో యర్రా పృధ్వీరాజ్ (3/15), పి.తపస్వి (2/13) రాణించారు. గోదావరి టైటాన్స్ నిర్దేశించిన సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో తడబడిన ఉత్తరాంధ్ర లయన్స్ విజయం కోసం చివరి బంతి వరకు పోరాడాల్సి వచ్చింది. కేవలం 14 పరుగులకే ఓపెనర్లు ఎస్.తరుణ్ (1), కెప్టెన్ గుల్ఫామ్ (4)తోపాటు, వన్‌డౌన్ తపస్వి (0) అవుటయ్యారు. ఈ దశలో బ్యాటింగ్‌కు దిగిన శ్రీరామ్ వెంకట రాహల్ (31; 3 బౌండరీలు, 1 సిక్సర్), బి. సాత్విక్ (38; 1 ఫోర్, 4 సిక్సర్లు), సిర్ల శ్రీనిష్ (12), ధీరజ్ కుమర్ (26 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) రాణించి ఆదుకోవడంతో 19.5 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 128 పరుగులు సాధించి విజయం అనూహ్య విజయం సొంతం చేసుకుంది. గోదావరి టైటాన్స్ బౌలర్లలో కేవీ.శశికాంత్ (3/29), వి.వర్మ (2/27) రాణించారు.

శారదా పీఠానికి ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకోవాలి

ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

» వివరాలు మెయిన్‌లో


శారదా పీఠానికి కేటాయించిన కొండను పరిశీలిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి

పింఛన్ల పంపిణీతో చంద్రబాబు సమర్థత వెల్లడి

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్


మాట్లాడుతున్న నజీర్

మహారాణిపేట, జూలై 2: రాష్ట్రం వ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో సాగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహిలచిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమర్థత ఉన్న నాయకుడి పాలన ఎలా ఉంటుందో ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపారన్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వలంటీర్ల పేరుతో వృద్ధులకు పింఛన్లకు మూడునెలలపాటు ఇబ్బందులుపాలు చేశారన్నారు. కేవలం 1,26 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేసి, వాలంటీర్లు అవసరం లేదని నిరూపించారన్నారు. పెంచి మొత్తంతో పాటు ఒక్కొక్కరికి రూ. 7 వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ. 4వేల కోట్లు అందించారన్నారు. విశాఖ జిల్లాలోనే సుమారు 95 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయిందన్నారు.

బాబోయ్ ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

దరిచేరే ప్రమాదం ఉంటుంది. కాగా ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లోనూ, జనావాసాల మధ్య రోజుల తరబడి పేరుకుపోయి ఉంటున్నాయి. వర్షం పడినప్పుడు, డ్రైనేజీలో ప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు వాటిల్లో నీరు చేరుతుంది. ఇది దోమల వ్యాప్తికి అనుకూలంగా మారుతోంది. దోమల వ్యాప్తి కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల ద్వారా సముద్రంలోకి చేరడం వల్ల సముద్ర జలాలు కలుషితమైపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రజీవులు తినడం వల్ల అవి మృత్యువాతపడుతున్నాయి.

పెరుగుతున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం

కేంద్ర ప్రభుత్వం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. దీనికోసం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుచేసే బాధ్యతను స్థానిక సంస్థలకే అప్పగించింది. దీనిప్రకారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం పది ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటుచేసింది. ఆయా బృందాలు నిత్యం తమ పరిధిలోని దుకాణాలకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జరగకుండా చూడడం, విక్రయించే వారికి జరిమానా విధించి, సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను సీజ్ చేయడం చేస్తున్నాయి. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది మార్చి వరకూ 22,547 దుకాణాలపై దాడులు చేశాయి. అందులో నిషేధించిన ప్లాస్టిక్ విక్రయిస్తున్న 8,013 దుకాణాల నుంచి 22,005 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.97,02,150 జరిమానా విధించారు. అయినప్పటికీ విక్రయాలు మరింతగా పెరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో కేన్సర్ ముప్పు

డాక్టర్ టి.నారాయణరావు, జనరల్ సర్జన్, నారాయణ మెడ్‌సిటీ

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుంచి టాన్సికోజీన్స్ అనే రసాయనం ఉత్పత్తి అవుతుంది. అదిమనిషి శరీరంలోకి ప్రవేశిస్తే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తులపనితీరును ప్రభావితం చేస్తుంది.ఆస్తమా వంటి రోగాలు చుట్టుముడతా యి. ఎండోక్రైనాలజీ అసమతౌల్యం,హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బతీయడం వల్ల గుండె సంబంధిత సమస్యలు, డిప్రెషన్, మహిళల్లో సంతానలేమి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.పర్యావరణ సైకిల్‌ను కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దెబ్బతీస్తుంది.

తీవ్రమైన అనారోగ్య సమస్యలకు కారణం

- డాక్టర్ వి.మురళీకృష్ణ, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ

ప్లాస్టిక్ కవర్స్‌లో పోసిన టీని సేవించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు రావచ్చు. తాగేటప్పుడు మైక్రో ప్లాస్టిక్స్ శరీరంలోకి వెళ్లి అన్ని అవయవాలను డ్యామేజ్ చేయవచ్చు. దీర్ఘకాలంలో కొన్నిరకాల కేన్సర్లకు దారితీస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలకు దోహదం చేస్తాయి. కాబట్టి, ప్లాస్టిక్ కవర్స్ వినియోగాన్ని తగ్గించడం చాలా ఉత్తమం. ప్లాస్టిక్ కవర్స్ పర్యావరణానికి కూడా తీవ్ర విఘాతాన్ని కలిగిస్తాయి.

దూరవిద్యలోనూ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ముట్టజెప్పాయని, దీనిపై కొత్తగా వచ్చే వైస్ చాన్సలర్, ఇతర అధికారులు దృష్టిసారించి విచా రణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎగ్జామ్ సెంటర్‌తో మేలు

గతంతో పోలిస్తే ఏయూ దూరవిద్యా కేంద్రంలోని కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా కనీసం పది వేల నుంచి 15 వేల మంది చేరుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఎంతోకొంత గుంజుకోవచ్చునన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు పరీక్షా కేంద్రాల ఏర్పాటుకోసం యత్నిస్తున్నాయి. ఈ విధంగా నగర పరిధిలోని ఓ కాలేజీకి పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. విద్యార్థుల నుంచి ఆ కాలేజీ అధికారులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. విద్యార్థికి అవసరమైన సహకారాన్ని అందించాలంటే మరింత చెల్లించాల్సిందేనని చెబుతున్నారు. డబ్బులు ఇవ్వనివారిని ఇబ్బందులకు గురిచేస్తుంటారంటున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి తమకు కేటాయించే విద్యార్థుల ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునేందుకు కొన్ని కాలేజీల యాజమాన్యాలు యత్నిస్తున్నాయి.

స్టడీ సెంటర్లకు ఎగనామం

ప్రతి అవసరానికి ఏయూలోని దూర విద్యా కేంద్రానికి రావడం విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. దీనిని దృష్టి ఉంచుకుని దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గతంలో ఇటు శ్రీకాకుళం జిల్లా నుంచి అటు గుంటూరు జిల్లా వరకు పది స్టడీ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఈ స్టడీ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన సేవలు అందించేలా సిబ్బందిని నియమించారు. అడ్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి ఫీజులు వసూలు, పుస్తకాల పంపిణీ వంటి సేవలను అందించేవారు. అయితే, ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నామని చెప్పి ఈ స్టడీ సెంటర్లను అధికారులు పూర్తిగా ఎత్తేశారు.

పెద్దదిక్కు లేని వీఎంఆర్‌డీఏ!

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి చేసింది పెద్దగా ఏమీ లేదు. మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని చెప్పిన సిరిపురంలోని మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం ఇంకో మూడు నెలలకు గానీ పూర్తి అయ్యేలా లేదు. అలాగే ఎన్ఏడీ జంక్షన్‌లో ఫ్లైఓవర్ పూర్తయి నాలుగేళ్లు అయినా దానితో ముడిపడిన రైలు ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా ఊపందుకోలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించిన నేచురల్ హిస్టరీ పార్క్ మ్యూజియానికి 15 ఎకరాల స్థలం కేటాయించినా దాని డీపీఆర్‌కు ఇప్పటివరకూ మోక్షం లభించలేదు. సరైన అజమాయిషీ లేకపోవడంతో పీపీపీలు చేపట్టినవారు, షాపింగ్ కాంప్లెక్స్‌లు అద్దెకు తీసుకున్న వారు డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. ఆఖరి నిమిషంలో వాటిపై దృష్టి పెట్టడంతో చావు తప్పి కన్ను లొట్టపోయినట్టుగా తయారైంది. కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ నడిపే ప్రైవేటు వ్యక్తి నుంచి రూ.2 కోట్లు రావలసి ఉందని ఆలస్యంగా గుర్తించి, కోర్టుకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకున్నారు. సీతమ్మధారలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ దుకాణదారుడు కోటి రూపాయల అద్దె కట్టలేక దానిని మూసేశాడు. అప్పుడు కళ్లు తెరిచి దానిని ఖాళీ చేయించారు. మరోవైపు వీఎంఆర్‌డీఏ భూములకు సరైన రక్షణ లేదు. ఉన్నతాధికారులకు తెలియకుండా దిగువ స్థాయి సిబ్బంది కోర్టులో అవతల పార్టీలకు అనుకూలంగా సాక్ష్యాలు చెబుతున్నా గుర్తించలేకపోతున్నారు. తెలుసుకునేసరికి ఆస్తులు పరాధీనం అవుతున్నాయి. ఇలా అనేక లోపాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌కే ఎంసీగా అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ఏర్పడిన సమస్యలు ఇవి. అలాకాకుండా ఇప్పటికైనా పూర్తిస్థాయి ఐఏఎస్ అధికారిని నియమిస్తే సంస్థ పట్టాల పైకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కమనీయం అప్పన్న కల్యాణం



మాంగళ్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

సింహాచలం, జూలై 2: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణల జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బాధితులకు ఆర్థిక సహాయం

భీమునిపట్నం, జూలై 2: పాడేరు ఘాట్‌రోడ్‌లో గత నెల 12న జరిగిన ప్రమాదంలో పలువురు మృతి చెందగా, మరికొందరు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరికి కె.నగరపాలెం శ్రీదుర్గాదేవి సప్లయర్స్, సౌండ్స్, కేటరింగ్స్, డెకరేషన్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్లాజి, ప్రెసిడెంట్ శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎల్లాజీ, గరికిన నూకరాజు, నరసింగ్, రాము, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జూలై 2: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 2 నుంచి పదో తేదీ వరకూ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి తెలిపారు. బీఏ హిస్టరీలో 40, పొలిటికల్ సైన్స్‌లో 40, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ 60, బీఎస్సీ ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40, జువాలజీలో 40 సీట్లు వున్నాయన్నారు. ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ)లో 30 సీట్లున్నాయని ఆయన తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

మధురవాడ, జూలై 2: మానం ఆంజనేయనగర్‌లోని శ్రీలలిత త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వరస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రతాప్‌రాజ్, జేడీ నాయుడు, కేవీ రావు, సోమేశ్వరరావు, విజయ్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

వరి సాగుకు రైతుల సన్నద్ధం



కృష్ణాపురంలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

పద్మనాభం, జూలై 2: మండలంలోని పలు గ్రామాలలో రైతులు వరి నారుమళ్లలో విత్తనాలు వేయడం ద్వారా ఖరీఫ్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది నైరుతి ప్రభావంతో వర్షాలు కురియడంతో పాటు ఆరుద్ర కార్తె ప్రారంభంతో రైతులు నారుమళ్లను తయారు చేసుకుని విత్తనాలు వేస్తున్నారు. కొంతమంది నారుకోసం విత్తనాలు వేయగా మరి కొందరు నేరుగా ఎద జల్లు పద్ధతిద్వారా పంటల సాగుకు ఉపక్రమిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు నాటికి వరినాట్లు వేసే ప్రక్రియ కూడా పూర్తవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అత్యధికంగా సుమారు నాలుగు వేల ఎకరాల విస్తీర్ణంలో వరిపంట పండిస్తారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 48, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 34, క్యారెట్ 36, దొండకాయలు 18, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 145, బరబాటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



కళానగర్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శివాజీ తదితరులు



విమ్స్‌లో లబ్ధిదారునికి పింఛను అందిస్తున్న నారు గోపి, సచివాలయ సిబ్బంది

సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం

మధురవాడ, జూలై 2: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసి చూపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుదేనని పలువురు తెలిపారు. పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తున్న సందర్భంగా మంగళవారం కళానగర్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాగోతి రాము, అప్పలరాజు, కాంతారావు, బాబులు, హసీనా తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలో పింఛన్లను పంపిణీ చేశారు. పిలకవానిపాలెం, వాంబేకాలనీ, స్వతంత్రనగర్‌కాలనీ, చంద్రంపాలెం, మల్లయ్యపాలెం, తదితర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ ఉద్యోగులతో కలిసి వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, కానూరి అచ్చుతరావు, పోతిన నాయుడు, నాగోతి సూర్యప్రకాశరావు, బయపల్లి శ్రీరామమూర్తి, జనసేన వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు తదితరులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు.



పింఛను అందజేస్తున్న కార్పొరేటర్ పీవీ

విమ్స్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

వెంకోజీపాలెం: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సికిల్ సెల్ అనిమియా వ్యాధితో బాధపడుతున్న 16వ వార్డుకు చెందిన పి.కీర్తనకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రూ.10వేలను వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి సచివాలయం సిబ్బందితో కలిసి మంగళవారం అందజేశారు. లబ్ధిదారులు ఎక్కడున్నా వారి వద్దకే వెళ్లి పెన్షన్‌ను అందజేయడం జరుగుతుందని గోపి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వార్డులోని ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రియదర్శిని కాలనీ 118 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ పి.ఈశ్వరరావు, శానిటరీ కార్యదర్శి గౌతమి, ఇమ్యూనిటీస్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో...

సింహాచలం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మహావిశాఖ 98వ వార్డులో మంగళవారం కూడా కొనసాగింది. ఈనెల 1న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే పింఛన్ల పంపిణీ చేపట్టినప్పటికీ సాంకేతిక కారణాలతో కొన్ని గంటల పాటు పంపిణీకి అవాంతరం ఏర్పడింది. తరువాత రాత్రి 8గంటల వరకు సుమారు 92శాతం పంపిణీ పూర్తికాగా మిగిలిన వారందరికి కార్పొరేటర్ పీవీ నరసింహం టీడీపీ నేతలు, సచివాలయ అధికారులు పంపిణీ పూర్తిచేశారు.



పిలకవానిపాలెంలో పింఛన్ ఇస్తున్న కార్పొరేటర్

క్రికెట్ ట్రోఫీ విజేత అమనాం జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దివీస్ ఎండీ మురళీకృష్ణ

భీమునిపట్నం (రూరల్), జూలై 2: మండలంలో నెలరోజులుగా జరుగుతున్న గ్రామస్థాయి క్రికెట్ పోటీల ఫైనల్స్ మంగళవారం మూలకుద్దులో నిర్వహించారు. ఛాలెంజర్స్ ట్రోఫీ విజేతగా అమనాం గ్రామానికి చెందిన బాల్ బర్నర్ జట్టు నిలిచింది. విజేతలకు దివీస్ ఎండీ దివి మురళీకృష్ణ ట్రోఫీతో పాటు, రూ.50 వేల నగదు బహుమతిని అందించారు. రన్నర్లుగా చిప్పాడ గ్రామానికి చెందిన కూల్ తంపర్లు జట్టు రూ. 25 వేలు పొందింది. మొత్తం 12 పంచాయతీలకు చెందిన 32 జట్లు పోటీపడ్డాయి మూడు నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10 వేల చొప్పున, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.5 వేలు బహుమతిగా అందించారు. క్రీడాకారులందరికీ క్రీడాదుస్తులు, టోపీలు, బ్యాట్లను దివీస్ అందించింది. అనంతరం ఎండీ మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇటువంటి పోటీలను తరచూ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఈడీ ఎన్వీ రమణ, జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు, ఏజీఎం ప్రభాకరరావు, సామాజిక సేవా విభాగం మేనేజరు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్పంతో చదివితేనే పోటీ పరీక్షలలో విజయం

» సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్

సాగర్‌నగర్, జూలై 2: సంకల్పంతో చదివితేనే పోటీపరీక్షలలో విజయం సాధించవచ్చని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ అన్నారు. బీచ్‌రోడ్డులోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను మంగళవారం సందర్శించిన ఆయన విద్యార్థులనుద్దేశించిమాట్లాడారు. స్టడీసెంటర్‌లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ విజయకృష్ణ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. ఉపసంచాలకులు కె.రామారావు మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు బ్యాచ్‌లకు కోచింగ్ ఇచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోటీపరీక్షలలో సుమారు 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇటీవలి గ్రూప్1లో 12 మంది, గ్రూప్2లో 80 మంది అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మత్తు పదార్థాలతో దుష్పరిణామాలు తెలియాలి

» పాఠశాల విద్య జోన్-1 ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్

ఆరిలోవ జూలై 2: పాఠశాల స్థాయి నుంచి పిల్లలకు మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడే దుష్పరిణామాల మీద అవగాహన కల్పించాలని పాఠశాల విద్య జోన్-1 ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం విశాఖ వ్యాలీ స్కూల్‌లో మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల నిర్వహణలోని వివిధ అంశాలను సమీక్షించి, పిల్లల పట్ల సహనంగా మెలగాలన్నారు. ప్రతి పాఠశాల కచ్చితంగా సమయపాలన పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పిల్లల వ్యక్తిగత బోధనకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ డ్రాపవుట్లను నిరోధించాలని, హాజరు శాతం పెంచాలని, ప్రతి విద్యార్థీ తగిన సామర్థ్యంతో తరగతిలోకి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. దానికోసం బేస్ లైన్ టెస్ట్‌ను ఉపయోగించుకుని ఆగస్టు 31 నాటికి ప్రతి విద్యార్థికి ఆ తరగతికి సంబంధించిన కనీస విద్యాస్థాయి ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ బి. శ్రీనివాసరావు, ఉప విద్యాశాఖాధికారి కె.సువర్ణ, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమారి, సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్

పేద కుటుంబానికి మందులు వితరణ



బాధితురాలికి మందులు అందిస్తున్న సేవా సంస్థ సభ్యులు

ఆరిలోవ, జూలై 2: అత్యంతదీనమైన స్థితిలో ఉన్న ఓ కుటుంబాన్ని ఆదుకునేందుకు రవీంద్రనగర్ కేంద్రంగా సేవలందిస్తున్న సేవాస్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చింది. కుటుంబంలో లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో మంచాన పడింది. ఆమెకు ఆరేళ్ల కుమార్తెతో పాటు, మతిస్థిమితంలేని అన్నయ్య ఉన్నాడు. వీరికి సేవలందించేందుకు భర్త ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ పరిస్థితుల్లో మహిళ అనారోగ్యం నుంచి కోలుకునేందుకు మందులను సంస్థ అందించింది. నిత్యావసర సరకులను కూడా అందించారు. సంస్థ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, అసోసియేషన్ సభ్యులు ఎం.ప్రకాశ్ పాత్రుడు, ఎస్.ఆనంద్, కె.నానాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'ఏక్ పేడ్ మా కే నామ్'



మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, తదితరులు

వెంకోజీపాలెం, జూలై 2: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమాన్ని గ్రేటర్ 15వ వార్డులో మంగళవారం బీజేపీ నాయకులు నిర్వహించారు. హెచ్‌బీకాలనీ ఉక్కు కళావేదిక సమీపంలోని పార్కులో వార్డు బీజేపీ అధ్యక్షుడు కనకాల పాపారావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అరకు బీజేపీ ఇన్‌చార్జి పరశురాంరాజు, పోతల సత్యనారాయణ, మురళీమోహన్‌రాజు, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, జనసేన అధ్యక్షుడు యడ్ల కళ, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పింఛన్ల పంపిణీ

» వలంటీర్లు లేకుండానే ప్రక్రియ పూర్తి

» తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 2: రాష్ట్రంలో విజయవంతంగా పింఛన్ల పంపిణీని చేపట్టడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, దీంతో పింఛనుదారుల కళ్లల్లో ఎంతో ఆనందాన్ని చూశామన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోతే ఫించన్లు ఇవ్వలేమంటూ గత వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడిందని, అయితే ఇప్పుడు తాము వలంటీర్లు లేకుండానే వంద శాతం పింఛన్లను ఒక్కరోజులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశామన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలవరం నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొండా జగన్, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గంధం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై హోం మంత్రికి వినతి



హోం మంత్రి అనితకు సమస్యలు వివరిస్తున్న గోవింద్

ఆరిలోవ, జూలై 2: హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం రామకృష్ణాపురంలోని కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, కార్యదర్శి జాన్, చిన్ని, గాడి సత్యం, బాలస్వామి, అప్పాజి, ఈశ్వరరావు, భైరవుడు తదితరులు ఆమెను మార్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆరిలోవ పరిధిలోని పలు సమస్యలను మంత్రి ఎదుట ప్రస్తావించారు.

బావికి వందేళ్ల వేడుక

» కేక్ కట్ చేసిన శ్రీసీతారామా సేవా సంఘం సభ్యులు



బావి వద్ద వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, జూలై 2: పాత వెంకోజీపాలెం గవర వీధిలో 100 ఏళ్ల క్రితం తవ్విన బావికి మంగళవారం శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో 1923 జూలై 2వ తేదీన బావిని నిర్మించారని, అప్పట్లో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించిందన్నారు. అంతేకాకుండా 1992 ఫిబ్రవరి 12న అప్పటి మేయర్ డీవీ సుబ్బారావు, ఎమ్మెల్యే టి.సూర్యనారాయణరెడ్డి, కార్పొరేటర్ పీఎస్ నాయుడు, శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ పరిధిలోని నివాసితులకు ఏర్పాటు చేసిన కొళాయిలకు ఈ బావి నుంచే పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారని వివరించారు. కాలక్రమేణా భూగర్భ జలాలు అడుగంటడంతో బావిలో నీరు తగ్గిపోయిందని, ఫలితంగా కొళాయిలకు నీటి సరఫరా నిలిపివేశారన్నారు. శతాబ్ది వేడుకల నేపథ్యంలో బావితో పాటు చుట్టూ ఉన్న స్థలాన్ని శుభ్రం చేసి, వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశి, కార్యవర్గ సభ్యులు, గ్రామపెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న కన్వీనర్ దాసరి సత్యారావు

సింహాచలం, జూలై 2: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ తరగతుల గురుకుల పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో మిగులు సీట్లకు సింహాచలం గురుకుల పాఠశాల కన్వీనర్, ప్రధానాచార్యులు దాసరి సత్యారావు సారథ్యంలో మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఒకసీటుకు ఇద్దరు చొప్పున కౌన్సెలింగ్ చేశామని అనకాపల్లి గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు, కమిటీ సభ్యులు పి.వెంకటరెడ్డి తెలిపారు. అన్నవరం, తానాం, చోడవరం, పాయకరావుపేట బాలికల గురుకుల పాఠశాల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 3న సింహాచలం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

వైభవంగా బంగారమ్మ పండగ

సింహాచలం, జూలై 2: వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి బంగారమ్మ తల్లి వార్షిక పండగ మంగళవారం వైభవంగా జరిగింది. గతనెల 25న చాటింపుతో ప్రారంభమవగా సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. మంగళవారం అమ్మవారి శతకం పట్టు వద్ద పూజారి వంశీయులు లండ కుటుంబీకులు గరగలకు పూజలు చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు.బాలాలయంలోని అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం లండ రమణ, త్రినాథ్ ఘటాలను శిరస్సున దాల్చగా పాతఅడివివరం, తోటవీధి, గాంధీనగర్, రాజవీధి, ప్రధాన మార్గం మీదుగా అనుపు మహోత్సవాన్ని నిర్వహించారు. నేలవేషాలు, పులివేషాలు ప్రదర్శించారు. కార్పొరేటర్ పీవీ నరసింహం డాన్స్‌బేబీడాన్స్ ఏర్పాటు చేశారు.

కూరగాయల సాగులో మెలకువలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సత్యనారాయణ రెడ్డి

ఎంవీపీ కాలనీ, జూలై 2: కూరగాయలు, పండ్లు, పువ్వులు తదితర పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానవన శాఖాధికారి కె.సత్యనారాయణ రెడ్డి రైతులకు వివరించారు. ఎంవీపీ కాలనీ రైతు బజారులో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయాల సాగు లాభసాటిగా ఉండాలంటే ఏం చేయాలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి.సోని, సురేశ్, జి.ప్రసాద్, జి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ ఛాత్రోపాధ్యాయులకు బహుమతులు



ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జూలై 2: డైట్ రెండో సెమిస్టర్ పరీక్షల్లో అధిక మార్కులు పొందిన ముగ్గురు ఛాత్రోపాధ్యాయులకు సంస్థ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి బహుమతులు అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధంగా కాలాన్ని వృథా చేయకుండా చదివితే విజయం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రొంగలి శ్యామల, హరిప్రియ, సమీర బాలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. చదువుతోపాటు జీవన నైపుణ్యాలు, సంస్కారం, మన సంస్కృతి నేర్చుకోవడం ముఖ్యమన్నారు. ఆ సంస్థ లెక్చరర్ జె.మాధవి తన సొంత నిధులను పలు కార్యక్రమాలకు అందజేయడంతో ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సీనియరు లెక్చరర్లు ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, అధ్యాపకులు జె.మాధవి, సారిపల్లి త్రినాధరావు, గొట్టేటి రవి, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

'రేషను సరకులు సక్రమంగా పంపిణీ చేయాలి'

పద్మనాభం, జూలై 2: సంచార వాహనాల ద్వారా రేషన్ సరకులను ప్రజలకు సక్రమంగా అందించాలని తహసీల్దారు ఎన్.వెంకటరావు సూచించారు. పలు గ్రామాలలో వాహనాల ద్వారా అందిస్తున్న సరకుల పంపిణీని మంగళవారం ఆయన పరిశీలించారు. సరకుల పంపిణీలో అలసత్వం వహించినా, అవకతవకలు జరిగినా సహించేది లేదని సంచార వాహన నిర్వాహకులను హెచ్చరించారు. మద్ది, కృష్ణాపురం తదితర గ్రామాలలోని వాహనాల ద్వారా సరకుల పంపిణీ తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.